ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ



తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

epaper.vaartha.com WWW.VAARTHA.COM

కరీంనగర్ : fb.com/vaartha

PUBLISHED FROM KARIMNAGAR, WARANGAL, HYDERABAD, VIJAYAWADA, VISAKHAPATNAM, RAJAHMUNDRY, KADAPA, NIZAMABAD, ONGOLE, TIRUPATHI, ANANTAPUR, KURNOOL, MAHABUBNAGAR, KHAMMAM, NELLORE, NALGONDA, GUNTUR, TADEPALLIGUDEM,SRIKAKULAM

31-5-2023 బుధవారం సంపుటి : 29 సంచిక : 120 పేజీలు : 8+16 వెల : 6.50



హిమాచల్ సిజెగా జస్టిస్ రామచంద్రరావు
మణిపూర్ పరిస్థితిపై రాష్ట్రపతి జోక్యం కోరిన కాంగ్రెస్
5లో


## దశాబ్దాల కల సాకారం

# సాగునీటితో అచ్చంపేట సస్యశ్యామలం

### రూ.2300 కోట్ల ఉమామహేశ్వర చెన్నకేశవస్వామి ప్రాజెక్టు: మంత్రి హరీష్



మంగళవారం అచ్చంపేట బహిరంగ సభలో మాట్లాడుతున్న మంత్రి హరీష్

**అచ్చంపేట, మే 30 ప్రభాతవార్త:** నల్లమల్ల ప్రాంతాన్ని సస్యశ్యామలం చేయడానికి ఈ ప్రాంతంలో వ్యవసాయాభివృద్ధికి సాగునీటిని అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చొరవ తీసుకుంటుందని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి తన్నీరు హరీష్‌రావు అన్నారు. మంగళవారం అచ్చంపేట నియోజకవర్గ కేంద్రంలో ప్రభుత్వ విఫ్, అచ్చంపేట ఎమ్మెల్యే గువ్వల బాలరాజు అధ్యక్షతన నిర్వహించిన బహిరంగ సభకు రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి తన్నీరు హరీష్‌రావు, పార్లమెంట్ సభ్యులు, జెడ్పీ చైర్ పర్సన్ శాంతకుమారి, సీఎస్ఎంఎస్ ఐడీసీ చైర్మన్ ఎర్రోళ్ల శ్రీనివాస్, జెడ్పీ వైస్ చైర్మన్ ఠాకూర్ బాలాజీసింగ్‌లు హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి హరీష్‌రావు మాట్లాడుతూ రూ.2300 కోట్ల ఉమా మహేశ్వర చెన్నకేశవస్వామి, ఆంజనేయస్వామి లిఫ్ట్ ఇరిగేషన్లు మంజూరు చేసి త్వరితగతిన సాగునీరు అందించడమే ఏకైక లక్ష్యమని ఆయన పేర్కొన్నారు. కృష్ణానదీ నీరు అచ్చంపేటకు వస్తే అచ్చంపేట రూపురేఖలు మారుతాయని, దశాబ్ద కాలంగా ఈ ప్రాంత ప్రజలు కన్న కళలను రాష్ట్ర ప్రభుత్వం నిజం చేయనుందని ఆయన పేర్కొన్నారు. తరతరాలుగా అచ్చంపేట నియోజకవర్గం గుర్తు పెట్టుకునే కార్యక్రమాలను గువ్వల బాలరాజు సాధించారని ఆయన గుర్తు చేశారు. పాలమూరు-రంగారెడ్డి, నెట్టెంపాడు, డిండి పథకాలు పూర్తైతే ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో సాగు,తాగునీటికి కొదవఉండదని ఆయనపేర్కొన్నారు. పాలమూరు- ≫2

# బుక్స్‌లేవు.. క్లాసులెలా?

### రేపటి నుంచి జూనియర్ కాలేజీలు పునః ప్రారంభం

### పూర్తికాని ఇంటర్ పాఠ్య పుస్తకాల ప్రింటింగ్

### సెకండియర్ విద్యార్థులకు పుస్తకాలెప్పుడు?



**హైదరాబాద్, మే 30, ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్రంలోని రేపటి(గురువారం జూన్ 1) నుంచి జూనియర్ కాలేజీలు వేసవి సెలవులు ముగించుకొని తిరిగి ప్రారంభం కాబోతున్నాయి. రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రైవేటు, కార్పొరేట్ అన్ని కాలేజీలు కూడా జూన్ 1 నుంచే ప్రారంభించాలని ఇంటర్ బోర్డు కార్యదర్శి నవీన్ మిత్తల్ మార్చి 31న ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో రేపు రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రైవేటు జూనియర్ కాలేజీలన్నీ 2023-24 విద్యా సంవత్సరంకు సంబంధించి పునఃప్రారంభం కానున్నాయి. ఈ ఏడాది జూన్ 1 నుంచే ఇంటర్ మొదటి సంవత్సరం క్లాసులను కూడా ప్రారంభిస్తామని ఇంటర్ బోర్డు కార్యదర్శి ఉత్తర్వులో ప్రకటించారు. నేటి వరకు కూడా రాష్ట్రంలోని ప్రభుత్వ జూనియర్ కాలేజీలకు వేసవి సెలవులు కొనసాగాయి. అయితే ఈలోగా ఇంటర్ విద్యార్థులకు అందించాల్సిన పుస్తకాలను ప్రభుత్వం ఇంకా సిద్ధం చేయలేదు. ఇక ప్రైవేటు, కార్పొరేట్ జూనియర్ కాలేజీలకు సంబంధించిన యాజమాన్యాలు ఈ ఏడాది 2023-24 విద్యా సంవత్సరానికి సంబంధించిన అడ్మిషన్లను ఈ నెల15నుంచి చేసుకోవడానికి ఉత్తర్వులు ఇచ్చి ఉన్నందున ఈ నెల 15 నుంచే ఇంటర్ మొదటి సంవత్సరంలో అడ్మిషన్లను తీసుకుంటాయి. కార్పొరేట్ కాలేజీల్లో దాదాపు అడ్మిషన్ల ప్రక్రియను ఇప్పటికే పూర్తి చేశారు. ఇక ప్రైవేటు జూనియర్ కాలేజీల్లో కూడా కొన్ని కాలేజీల్లో పూర్తి కాగా.. మరికొన్ని కాలేజీల్లో కొనసాగుతోంది. ఇక ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో అయితే జూన్ 1 నుంచే అడ్మిషన్ల ప్రక్రియ ప్రారంభం కానున్నట్టు తెలుస్తోంది. రాష్ట్రంలో 405 ప్రభుత్వ జూనియర్ కాలేజీలు ఉన్నాయి. వాటిలో రేపటి నుంచి ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు క్లాసులు ప్రారంభం కానున్నాయి. అయితే ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో చదివే విద్యార్థులకు ప్రభుత్వమే పాఠ్యపుస్తకాలను ఉచితంగా సరఫరా చేస్తుంది. అయితే రాష్ట్రంలోని ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో చదువుతున్న విద్యార్థులు ఉచితంగా పంపిణీ చేయాల్సిన పాఠ్యపుస్తకాలకు సంబంధించిన ప్రింటింగ్ ప్రక్రియ ఇప్పుడే ప్రారంభమైనట్టు తెలుస్తోంది. ముద్రణ ప్రక్రియ ఇప్పుడు ప్రారంభమైతే ప్రింటింగ్ పూర్తవడానికి కనీసం 15 నుంచి 20 రోజుల వరకు పడుతుంది. అంటే పాఠ్యపుస్తకాల ముద్రణ పూర్తకావడానికే ఈ నెలాఖరు అయ్యే అవకాశం ఉంది. బుక్స్ ప్రింట్ అయిన తరువాత పంపిణీ కోసం జిల్లా కేంద్రాలకు పంపించాలి.. అక్కడి నుంచి మండల కేంద్రాలకు.. అక్కడి నుంచి కాలేజీలకు చేరాల్సి ఉంటుంది. ఇదంతా జరగడానికి కనీసంగా 15 రోజులైనా పట్టే అవకాశం కనిపిస్తోంది. ఈ లెక్కన చూస్తే రాష్ట్రంలోని ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో చదివే విద్యార్థులకు జులై నెల రెండో వారంలో గానీ ఉచిత పాఠ్యపుస్తకాలు అందే అవకాశం కనిపించడం లేదు. రేపటి నుంచి రాష్ట్రంలో జూనియర్ కాలేజీలు ప్రారంభం అవుతున్న నేపథ్యంలో రాష్ట్రంలోని ≫2



జమ్మూలోని ఝజ్జర్ కొట్టిలో ప్రమాదానికి గురైన బస్సు


# లోయలో పడిన బస్సు

### 10 మంది యాత్రికులు మృతి

### జమ్మూలో దుర్ఘటన

### వైష్ణోదేవి ఆలయానికి వెళ్లివస్తుండగా ప్రమాదం

**శ్రీనగర్, మే 30:** జమ్మూకశ్మీర్‌లో ఘోర రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. యాత్రికులతో వెళ్తోన్న బస్సు లోయలో పడి 10 మంది ప్రాణాలు కోల్పోయారు. మంగళవారం తెల్లవారు జామున ఈ దుర్ఘటన జరిగింది. అధికారులు తెలిపిన వివరాల ప్రకారం, పంజాబ్‌లోని అమృత్‌సర్ నుంచి కొంతమంది యాత్రికులు జమ్మూకశ్మీర్‌లోని మాతా వైష్ణోదేవి ఆలయాన్ని దర్శించుకునేందుకు బస్సులో బయల్దేరారు. వైష్ణోదేవి ఆలయ బేస్ క్యాంప్ అయిన కత్రాకు వెళ్తుండగా, మార్గమధ్యంలో ఝజ్జర్ కొట్టి ప్రాంతంలో జమ్మూ-శ్రీనగర్ హైవేపై బస్సు ≫2



# పలు ప్రాంతాల్లో భారీ వర్షాలు

### ఆవర్తన ద్రోణి ప్రభావం

**హైదరాబాద్, మే 30, ప్రభాతవార్త:** తెలంగాణలోని పలు జిల్లాల్లో ఆవర్తన ద్రోణి ప్రభావంతో వర్షాలు కురుస్తున్నాయి. ఈదురు గాలలతో కూడిన భారీ వర్షం మంగళవారం తెల్లవారు జాము నుండి కురుస్తోంది. ముఖ్యంగా భువనగిరి జిల్లాలో ఉదయం నుండి భారీ వర్షాలు కురుస్తున్నాయి. వలిగొండ, ఆత్మకూరు, మోత్కూరు తదితర మండలాల్లో ఈదురు గాలులతో కూడిన వర్షం కురుస్తోంది. దీంతో మూసీ నది,చిన్న కాలువలు పొంగి ప్రవహిస్తున్నాయి. ఉమ్మడి మెదక్, వరంగల్ తదితర జిల్లాల్లో భారీ వర్షం పడుతుండటంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. మహబూబాబాద్ జిల్లాలోని మహబూబాబాద్, గార్ల, బయ్యారం, కే సముద్రం, ల్లికుదురు తదితర మండలాల్లో ఈదురు గాలులతో కూడిన వర్షం కురుస్తోంది. మరో వైపు ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని పలు ప్రాంతాల్లో ≫2

# ధాన్యం కదలని దైన్యం

### వారాల తరబడి రైతులు పడిగాపులు

### కొనసాగుతున్న కోత

### లారీలు, హమాలీల కొరత



**హైదరాబాద్, మే 30, ప్రభాతవార్త:** తెలంగాణలో రైతులు ధాన్యం అమ్ముకునేందుకు కొనుగోలు కేంద్రాలు, కుప్పల వద్ద వారాల తరబడి రాత్రి, పగలు పడిగాపులు కాస్తున్నారు. దీనికి తగినట్లుగా పలు చోట్ల రైస్ మిల్లుల కేటాయింపులు సక్రమంగా లేకపోవడతో లారీల కొరత ఏర్పడి ధాన్యం రవాణా స్థంభించిపోయింది. దీంతో కొనుగోలు కేంద్రాల్లో ఎక్కడి ధాన్యం కుప్పలు అక్కడే ఉండిపోతున్నాయి. ఫలితంగా ధాన్యం విక్రయించినా బస్తాల వద్ద రోజుల తరబడి కాపలా కాసే పరిస్థితి రైతులకు నెలకొంది. మరోపక్క ధాన్యం కొనుగోలు చేయాలని, తరుగు లేకుండా తీసుకోవాలని డిమాండ్ చేస్తూ వివిధ ప్రాంతాల్లో రైతుల ఆందోళనలు కొనసాగుతూనే ఉన్నాయి. వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో సకాలంలో తీసుకోకపోవడంతో జనగామ, మహబూబాబాద్, భువనగిరి, జగిత్యాల తదితర జిల్లాల్లో రైతులురాస్తారోకోలు, ధర్నాలు, ధాన్యానికి నిప్పుపెట్టడం వంటి వివిధ మార్గాల్లో నిరసనలు వ్యక్తం చేస్తున్నారు. కొనుగోలు కేంద్రాలకు అమ్ముకునేందుకు తీసుకువచ్చిన ధాన్యం వారాల తరబడి అవుతున్నా కొనకపోవడంతో రాష్ట్రంలో రైతుల ఆందోళనలు కొనసాగుతున్నాయి. కొనుగోలు కేంద్రాల్లో ధాన్యానికి సకాలంలో కాంటాలు పెట్టడం లేదు. కొన్ని చోట్ల ధాన్యం తెచ్చి మూడు వారాలు దాటినా వాటిని కొనుగోలు చేయడం లేదు. ఎట్టకేలకు కాంటాలు పెడుతున్నా తాలు, తరుగు పేరుతో మిల్లర్ల దోపిడీ కొనసాగుతోంది. ఈ బాధలు భరించ లేక కొందరు రైతులు ధాన్యాన్ని కల్లాల్లోనే ప్రైవేటు వ్యాపారులకు తగ్గువ ధరలకు తెగనమ్ముకుంటున్నారు. ధాన్యం కొనుగోళ్ల సకాలంలో చేయాలని డిమాండ్ చేస్తూ భువనగిరి జిల్లా కలెక్టరేట్‌ను రైతులు ముట్టడించారు. తదుపరి హైదరాబాద్-వరంగల్ జాతీయ రహదారిపై రాస్తారోకో చేశారు. జనగామ జిల్లా పాలకుర్తి మండలంలోని విస్నూర్ గ్రామంలో వరి ధాన్యం కొనుగోలు చేయాలని డిమాండ్ చేస్తూ రైతులు ఆందోళనకు దిగారు. దాదాపు రెండు నెలలు గడిచినా ఇప్పటికీ కాంటాలు వేయడ లేదంటూ ఆగ్రహాలు వ్యక్తం చేశారు. ధాన్యం బస్తాలను తరలించకపోవడంతో రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు. అంతేకాకుండా ధాన్యం బస్తాలకు నిప్పుపెట్టి ఆందోళన చేశారు. అదేవిధంగా మహబూబాబాద్ పట్టణంలో పలు రైస్ మిల్లుల వద్ద ధాన్యం లోడ్‌లతో లారీలు కిలో మీటర్ల మేర బారులు కట్టాయి. దాదాపు ఐదు రోజులు అవుతున్నా రైస్ మిల్లర్లు వాటిని దింపుకోకపోవడంతో రైతులు, వాహనదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. భూపాలపల్లి జిల్లా మల్హర్ మండలంలో రైతులు రేయింబవళ్లు కొనుగోలు కేంద్రాలు, ధాన్యం కుప్పల వద్ద కాపలా కాస్తున్నారు. ≫2



## లోకసభ సీట్లలో

# దక్షిణాదికి అన్యాయం

### జనాభా నియంత్రణతో సీట్లు కోల్పోవడం బాధాకరం

### దీనిపై అందరు గళమెత్తాలి: మంత్రి కెటిఆర్

**హైదరాబాద్ మే 30 ప్రభాతవార్త:** జనాభా ప్రాతిపదికన 2006 సంవత్సరం తరువాత జరగనున్న లోకసభ స్థానాల డిలిమిటేషన్ వల్ల దక్షిణాది రాష్ట్రాలకు తీవ్రమైన అన్యాయం జరుగుతుందని మంత్రి కె.తారకరామారావు అన్నారు. అధిక జనాభాతో సతమతమవుతున్న దేశాన్ని కాపాడుకునేందుకు, జనాబా నియంత్రణ పద్ధతులు పాటించాలని దశాబ్దాల నుంచి కేంద్రం చెబుతున్న మాటలను విధానాలను నమ్మి, ప్రగతిశీల విధానాలతో జనాభా నియంత్రణ చేసిన దక్షినాది రాష్ట్రాలు ఈ రోజు తీవ్ర అన్యాయానికి లోనయ్యే అవకాశం ఉందన్నారు. ప్రగతి శీల విధానాలతో ముందుకు పోతున్న దక్షిణాది రాష్ట్రాలు ఈ నూతన డిలిమిటేషన్ వల్ల తక్కువ లోకసభ స్థానాలు పొందడం అన్యాయం, బాధకరం అన్నారు. మరోవైపు కేంద్ర ప్రభుత్వ విజ్ఞప్తులను పట్టించుకోకుండా జనాభా నియంత్రణ చేయని రాష్ట్రాలు, ముఖ్యంగా ఉత్తరాష్ట్రాలు లోకసభ సీట్ల పెంపుతో లబ్దిపొందుతున్నాయన్నారు. ఇది చాలా దురదృష్టకరం అన్నారు. జనాభా నియంత్రించిన కేరళ, తమిళనాడు, ఏపి, కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాలు ఈ రోజు తీవ్రంగా తమ ప్రగతిశీల విధానాలకు శిక్షించబడుతున్నాయన్నారు. కేవలం జనాభా నియంత్రణ మాత్రమే కాకుండా అన్ని రకాల మానవాభివృద్ధి సూచిల్లోనూ దక్షిణాది రాష్ట్రాలు ముందు వరుసలో ఉన్నాయన్నారు. కేవలం 18శాతం జనాభా కలిగిన దక్షిణాది రాష్ట్రాలు 35శాతం జాతీయ స్థూల జాతీయోత్పత్తికి నిధులు అందిస్తున్నాయన్నారు. జాతీయ ఆర్థిక అభివృద్ధికి, దేశ అభివృద్ధికి ఎంతగానో దోహదం చేస్తున్న దక్షిణాది రాష్ట్రాలు అసంబద్ధమైన లోకసభ డిలిటేషన్ విధానం వల్ల భవిష్యత్తులో తమ ప్రాధాన్యత కోల్పోరాదన్నారు. తమ ప్రగతిశీల విధానాలను లబ్దిపొందాల్సిన చోట తీవ్రమైన అన్యాయానికి గురవుతున్న దక్షిణాది రాష్ట్రాల వాణిని వినిపించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ విషయంలో రాజకీయాలకు అతీతంగా జరుగుతున్న అన్యాయంపై దక్షిణాది రాష్ట్రాల నాయకులు, ప్రజలు గళమెత్తాలన్నారు.



మంగళవారం యుపిలోని హరిద్వార్ జిల్లా హర్‌కిపౌరి వద్ద రెజ్లర్లు

# పతకాలు 'గంగ'పాలు!

### ఢిల్లీ పోలీసుల వైఖరికి నిరసనగా పతకాలు గంగానదిలో కలిపేస్తామన్న రెజ్లర్లు

### మళ్లీ అడ్డుకున్న పోలీసులు

### అమరణ దీక్షకు సిద్ధమన్న ఆందోళనకారులు

**న్యూఢిల్లీ, మే 30:** రెజ్లింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా అధ్యక్షుడు, బిజెపి ఎంపి బ్రిజ్‌భూషణ్ శరన్‌సింగ్‌కు వ్యతిరేకంగా రెజ్లర్లు తమ పోరాటాన్ని మరింత ముమ్మరంచేశారు. కొత్త పార్లమెంటు ప్రారంభోత్సం సందర్భంగా అక్కడికి వెళ్లేందుకు యత్నించిన రెజ్లర్లను అడ్డుకున్న పోలీసులు వారిని అదుపులోకి తీసుకున్నారు. తర్వాత వారు ఆందోళన చేస్తున్న జంతర్‌మంతర్ వద్ద గుడారాలను తొలగించి ధర్నాకు అనుమతి ఇవ్వబోమని ఢిల్లీ పోలీసులు తేల్చి చెప్పారు. ఈ నేపథ్యంలోనే భవిష్యత్ కార్యాచరణపై రెజ్లర్లు కీలక ప్రకటన చేశారు. ఇన్నేళ్లు తాము కష్టపడి సాధించిన పతకాలను ఎటువంటి అర్థం లేకుడా పోయిందని రెజ్లర్లు ఆందోళన వ్యక్తం చేశారు. అందుకోసమే తాము గెలుచుకున్న పతకాలను హరిద్వార్‌లోని గంగానదిలో కలిపేస్తామని ≫2

## పద్మశ్రీలు, ఖేల్‌రత్నలు

# వాపస్!

### మణిపూర్‌లో శాంతి కోసం అమిత్‌షాతో క్రీడాకారులు



**ఇంఫాల్, మే 30:** మణిపూర్‌కు చెందిన జాతీయ అంతర్జాతీయ క్రీడాకారులు తమ రాష్ట్ర ప్రాదేశిక సమగ్రతను పరిరక్షించి శాంతిస్థాపన జరక్కపోతే తాము సాధించిన పతకాలను వాపసుచేస్తామని హెచ్చరించారు. మణిపూర్‌కు చెందిన 11 మంది విజేతలుగా వచ్చిన క్రీడాకారులు కేంద్ర హోంమంత్రి అమిత్‌షాకు రాష్ట్రంలో జరుగుతున్న హింసాకాండపై ఆందోళన వ్యక్తంచేస్తూ వినతిపత్రం అందచేసారు. ధ్యాన్‌చంద్ అవార్డుగ్రహీత అనితా చాను, అర్జున అవార్డు గ్రహీతలు ఎన్.కుంజరాణిదేవి,పద్మశ్రీఇ, ఎల్‌సరితాదేవి, సంధ్యారాణిదేవి(పద్మశ్రీ గ్రహీతలు)మీరాభాయ్‌చాను పద్మశ్రీ, రాజీవ్‌గాంధీ ఖేల్‌రత్న గ్రహీతలు వంటి వారు ఈ 11 మందిలో ఉన్నారు. శాంతిస్థాపన, మణిపూర్ సమగ్రతకు హోంమంత్రి అమిత్‌షా తమకు హామీ ఇవ్వనిపక్షంలో తామంతా కూడా భారత ప్రభుత్వం ఇచ్చిన అవార్డులు,పురస్కారాలను వెనక్కి ఇచ్చేస్తామని అనితా చాను వెల్లడించింది. తమ డిమాండ్ నెరవేరనిపక్షంలో భవిష్యత్తులో భారత్ తరపున ఎలాంటిక్రీడల్లోకూడాప్రాతినిధ్యం వహించబోమని వారు అన్నారు. ప్రధానికి రాసిన లేఖను కేంద్ర హోంమంత్రి అమిత్‌షాకు అందచేసారు. వినతిపత్రాన్ని మణిపూర్ సిఎం బీరేన్‌సింగ్‌కు కూడా ఇచ్చామని, అమిత్‌షాను కలిసేందుకు ఏర్పాట్లు చేస్తామని హామీ ఇచ్చారు. చురచంద్‌పూర్‌నుంచి కేంద్ర మంత్రి రాగానే ఈ మెమరాండం ను ఆయనకు అందచేస్తామని మీరాబాయ్‌చాను తెలిపింది. రాష్ట్రంలోని అర్జున అవార్టీలుకూడా ఈ వినతపత్రంపై సంతకాలుచేసారు. అంతేకాకుండా ≫2





## పేపర్ లీకేజీ స్కాం

# నిందితుల డిబార్

### ఇక ఏ పరీక్షలు రాయకుండా 37 మందిపై వేటు

**హైదరాబాద్, మే 30, ప్రభాతవార్త:** తెలంగాణ స్టేట్ పబ్లిక్ సర్వీస్ కమిషన్(టీఎస్‌పీఎస్సీ) పేపర్ లీకేజీతో సంబంధం ఉన్న వారికి భారీ షాకిచ్చింది. ఇకపై వారు కమిషన్ నిర్వహించే ఎలాంటి పరీక్షలు రాయకుండా వారిపై నిషేధం విధిస్తూ నిర్ణయం తీసుకుంది. భవిష్యత్‌లో టీఎస్‌పీఎస్సీ నిర్వహించే ఏ పరీక్ష కూడా రాయకుండా వారిని డిబార్ చేస్తున్నట్టు మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఇప్పటి వరకు జరిగిన టీఎస్‌పీఎస్సీ ప్రశ్నాపత్రాల లీకేజీతో సంబంధం ఉన్న మొత్తం 37 మందిని డిబార్ చేస్తున్నట్టు ప్రకటించింది. అయితే వారికి వివరణ ఇచ్చుకోవడానికి రెండు రోజుల సమయం ఇచ్చింది. రెండు రోజుల్లో డిబార్ నిర్ణయంపై వారు ఎలాంటి వివరణ ఇవ్వదలచుకున్నారో రెండు రోజుల్లో స్వయంగా కమిషన్‌కు సమర్పించాలని టీఎస్‌పీఎస్సీ కార్యదర్శి స్పష్టం చేశారు. గత ఏడాది డిసెంబర్ నాటికి రాష్ట్రంలోని వివిధ ప్రభుత్వ శాఖల్లో ఉన్న ఖాళీలను భర్తీ చేయడం కోసం టీఎస్‌పీఎస్సీ గ్రూప్-1 పోస్టుల నుంచి గ్రూప్-2, 3, 4 పోస్టుల భర్తీకి వివిధ శాఖల్లోని అసిస్టెంట్ ఎగ్జిక్యూటీవ్ ఇంజనీర్, జేఎల్, డీఎల్, డీఏవో, ఏవో తదితర సుమారు 17వేల పోస్టుల భర్తీ కోసం సుమారు 29 నోటిఫికేషన్లను జారీ చేసింది. వాటిలో 6 పరీక్షలను గత ఏడాది అక్టోబర్ నుంచి ఈ ఏడాది ఫిబ్రవరి వరకు ≫2

## క్యూనెట్ కుంభకోణంలో

# కీలక నేరగాడి అరెస్టు

**హైదరాబాద్, మే 30, ప్రభాతవార్త:** దేశ వ్యాప్తంగా సంచలనం రేపిన క్యూనెట్ కుంభకోణం కేసుకు సంబంధించి హైదరాబాద్ సిసిఎస్ పోలీసులు మరో కీలక నేరగాడిని అరెస్టు చేశారు. సికింద్రాబాద్‌లోని స్వప్నలోక్ కాంప్లెక్స్‌లో ఇటీవల జరిగిన అగ్ని ప్రమాదంలో ఆరుగురు అమాయక నిరుద్యోగులు మరణించడం సంచలనం రేపడం తెలిసిందే. వీరంతా క్యూనెట్ బాధితులుగా తేలడంతో మృతుల కుటుంబీకుల ఫిర్యాదు మేరకు రంగంలో దిగిన సిసిఎస్ పోలీసులు ఈ కేసును తీవ్రంగా పరిగణించి, భిన్న కోణాల్లో విచారణ చేసి బెంగుళూరులో వుంటున్న ఎపిలోని ప్రకాశం జిల్లాకు చెందిన గుమ్మడిల్లి రాజేష్ అలియాస్ రాజేష్ ఖన్నాను అరెస్టు చేశారు. ఇతని అరెస్టు వివరాలను సిటీ కొత్వాల్ ఆనంద్ మంగళవారం ≫2



# దేశం ఒక్కటే అన్న భావన ప్రజల్లో ఉండాలి

## రాజ్‌భవన్‌లో ఘనంగా గోవా రాష్ట్ర అవతరణ దినోత్సవాలు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, మే 30:** రాష్ట్రాలుగా విభజించినా... దేశం ఒక్కటే అన్న భావన ప్రజల్లో ఉండాలని తెలంగాణ గవర్నర్ తమిళిసై అన్నారు. మంగళవారం గోవా రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని రాజ్‌భవన్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రకృతిని ఆరాధించే వ్యక్తులకు, అహ్లాదకరమైన వాతావరణానికి నిలయమైన గోవా అవతరణ వేడుకలను తెలంగాణ రాజ్‌భవన్‌లో జరుపుకోవడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. ఫెర్నాండేజ్ ఫౌండేషన్ ప్రతినిధి డాక్టర్ ఏవిటా ఫెర్నాండేజ్,జెఎన్‌టీయు రిటైర్డ్ ప్రొఫెసర్ డాక్టర్ శ్రీనివాస్ చెనాయ్‌తో కలిసి వేడుకల్లో గవర్నర్ తమిళిసై పాల్గొన్నారు. ప్రజల సంస్కృతి,సంప్రదాయాలను గౌరవిస్తూ ఇలాంటి వేడుకలు జరుపుకోవడం రాష్ట్రాల మధ్య సరిహద్దులను చెరిపేస్తుందన్న గవర్నర్... దేశమంతా ఐక్యంగా ఉందనే విషయాన్ని చాటుతుందన్నారు. గోవా, తెలంగాణకు పోలికలు ఉన్నాయని, 1947లో ఆగస్టు 15న దేశానికి స్వాతంత్రం రాగా, ఈ రెండు ప్రాంతాలకు మాత్రం చాలా ఆలస్యంగా స్వాతంత్రం వచ్చిందని, సంవత్సరాల సమయం పట్టిందని గుర్తు చేశారు. తెలంగాణ రాజ్‌భవన్ ఆదివాసీల కోసం ఎంతో కృషి చేస్తుందన్న తమిళిసై సౌందరరాజన్... రాష్ట్ర ప్రభుత్వ సహాయం లేకుండానే 6 గ్రామాలను దత్తత తీసుకుని వారికి మౌలిక వసతులు కల్పిస్తున్న విషయాన్ని గుర్తు చేశారు.

# ఢిల్లీ లిక్కర్ పాలసీ కేసులో మరోసారి కవిత పేరు

## నాలుగో అనుబంధ ఛార్జిషీట్ దాఖలు చేసిన ఇడి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, మే 30:** ఢిల్లీ మద్యం పాలసీ కేసులో ఈడీ మరోసారి బిఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత పేరును ప్రస్తావించింది. కవితకు సంబంధించిన వ్యక్తిగా స్కామ్ అరుణ్ పిళ్లయ్ వ్యవహరించారని ఈడీ పేర్కొంది. ఢిల్లీ మద్యం కేసులో ఈడీ నాలుగో అనుబంధ చార్జ్‌షీట్ దాఖలు చేసింది. కేసులో సిసోడియా పాత్రపై అభియోగాలు ఈడీ ప్రధానంగా ప్రస్తావించింది. కవిత పాత్రపై సమగ్ర దర్యాప్తు వివరాలను కోర్టుకు ఇడి సమర్పించిది. నాల్గొవ సప్లమెంటరీ చార్జిషీట్‌లో 53సార్లు కవిత పేరు ప్రస్తావనకు వచ్చింది. 278 పేజీల భారీ చార్జ్‌షీట్‌లో ఆరుణ్ పిళ్లయ్,బుచ్చిబాబు సమీర్ మహేంద్ర కీలక స్టేట్‌మెంట్లలో కవిత పేరు ప్రస్తావనకు వచ్చింది. చార్జ్‌షీట్‌లో సంచలన విషయాలు వెలుగులోకి వచ్చాయి. లిక్కర్ పాలసీ రూపకల్పనకు ముందే కవిత,ఆప్ విజయ్ నాయర్ మధ్య చర్చలు జరిగాయి. ఆ తర్వాత మద్యం పాలసీ ఖరారు చేసినట్లు పేర్కొన్న ఈడీ కవిత కాల్ డేటా రికార్డును సాక్ష్యంగా సమర్పించింది. చార్జ్‌షీట్‌ను రౌస్ అవెన్యూ కోర్టు పరిగణలోకి తీసుకున్నట్లు తెలుస్తోంది.

# 50 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు రికార్డు

## గత సీజన్ కంటే 12 లక్షల మెట్రిక్ టన్నులు అధికం: మంత్రి గంగుల కమలాకర్

**హైదరాబాద్, మే 30, ప్రభాతవార్త:** దేశంలోనే ఏ రాష్ట్రం సాధించని విధంగా రికార్డు స్థాయిలోనే 50లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేశామని మంత్రి గంగుల కమలాకర్ స్పష్టం చేశారు. సిఎం కెసిఆర్ దార్శనికతతో, రైతు సంక్షేమ పాలనకు ఇది నిదర్శనమన్నారు. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. దాదాపు 10,200 కోట్ల విలువ చేసే ధాన్యాన్ని ఎనిమిది లక్షల మంది రైతుల నుంచి సేకరించామన్నారు. ఇందుకోసం రైతు చెంతకే వెళ్లి రికార్డు స్థాయిలో 7000 పైచిలుకు కొనుగోలు కేంద్రాలను ఏర్పాటుచేశామన్నారు. కొనుగోలు పూర్తయిన వెంటనే రైతుల అకౌంట్‌లోకి నేరుగా డబ్బులు జమ చేస్తున్నామన్నారు. ఇప్పటి వరకు 1400 కొనుగోలు కేంద్రాల్లో ప్రక్రియ పూర్తికాగా మూసివేశామన్నారు. గత సంవత్సరం ఇదే రోజు కంటే 12లక్షలు మెట్రిక్ టన్నులు అధికంగా సేకరించామన్నారు. ఎఫ్‌సిఐ నిర్దేశించిన కనీస నాణ్యత ప్రమాణాల ప్రకారం వచ్చిన ధాన్యంలో ఏ మిల్లర్ కోత పెట్టిన కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ప్రతిపక్షాలు కొనుగోలు కేంద్రాల వద్ద రైతులతో రాజకీయ చేయవద్దని హితవుపలికారు. విపత్కర పరిస్థితుల్లో రైతులకు అండగా కొనుగోళ్లు జరుగుతున్న సమయంలో ప్రతి ఒక్కరూ బాధ్యతగా ఉండాలని, రైతులను ఆదుకోవడంలో నప్రభుత్వానికి సహకరించాలని మంత్రి సూచించారు.

# విద్యుత్ గ్రేడ్ 3, 4 ఆర్టిజన్లకు ప్రత్యేక అలవెన్స్

**హైదరాబాద్, మే 30, ప్రభాతవార్త:** విద్యుత్ శాఖలోని గ్రేడ్ 3, 4 ఆర్టిజన్లకు ప్రత్యేక అలవెన్స్‌ను మంజూరు చేస్తూ దక్షిణ తెలంగాణ మండల విద్యుత్ పంపిణీ సంస్థ (ఎస్పీడీసీఎల్) నిర్ణయించింది. ఈ మేరకు దీనికి సంబంధించి ఎస్పీడీసీఎల్ సిఎండి రఘుమారెడ్డి తాజాగా ఉత్తర్వులు జారీ చేశారు. సంస్థలోని ప్రధానంగా స్తంభాలు ఎక్కడంతో పాటు, సబ్ స్టేషన్ల, కరెంటు సరఫరాను పునరుద్ధరించడం వంటి విభాగాల్లో పనిచేస్తున్న గ్రేడ్ 3, 4 ఆర్టిజన్ల వేతనంపై 10 శాతం అదనపు ప్రత్యేక అలవెన్స్‌లు అందించనున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.



మీడియాతో మాట్లాడుతున్న టిజెఎస్ రాష్ట్ర అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరాం

# దుష్టపాలనను తుదముట్టించే వరకు పోరాటం

## టిజెఎస్ రాష్ట్ర అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరాం

**జహీరాబాద్, మే 30, ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్రంలో కొనసాగుతున్న ప్రజా వ్యతిరేక దుష్ట పాలనను తుదముట్టించే వరకు కలిసి వచ్చే పార్టీలతో పోరాటం చేస్తామని టీజేఎస్ రాష్ట్ర అధ్యక్షులు ప్రొఫెసర్ కోదండరాం అన్నారు. మంగళవారం సంగారెడ్డి జిల్లా నియోజకవర్గ కేంద్రమైన జహీరాబాద్‌లో తెలంగాణ జన సభ పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో కోదండరాం మాట్లాడుతూ కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణలో ఉద్యమకారులకు తీవ్రంగా అన్యాయం జరిగిందని, ఉద్యమ ద్రోహులు అధికారంలో చేరి పరిపాలన సాగిస్తున్నారని విచారం వ్యక్తం చేశారు. ఉద్యమ సమయంలో ప్రజలకు చేసిన ఏ ఒక్క హామిని అమలు చేయడలేదని వాపోయారు. రాష్ట్రంలో అరాచక పాలన పాలన సాగుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజల భూములను గుంజుకుని వారిని మనో వేదనకు గురి చేయడం సరికాదని హితువు పలికారు. అకాల వర్షాలతో పంటలు నష్టపోయిన రైతులకు ఇంత వరకు నష్టపరిహారం చెల్లించకపోవడం ఏమిటని ఆయన ప్రశ్నించారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక సైతం 200 మంది నిరుద్యోగులు ఆత్మహత్యలు చేసుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సమావేశంలో టీజేఎస్ తాలుకా కన్వీనర్ మొగుడంపల్లి ఆశప్ప, జిల్లా మహిళా అధ్యక్షురాలు లక్ష్మి, నాయకులు, నీమ్జ్ భూ బాదితులు పాల్గొన్నారు.

# చలనచిత్రరంగంలో ప్రాతఃస్మరణీయుడు 'దర్శకరత్న' దాసరి

- ప్రముఖ సినీనటుడు, మాజీ ఎంపి ఎం.మురళీమోహన్
- వైభవోపేతంగా దాసరి-వంశీ పురస్కారాల ప్రదానోత్సవం
- వార్త జాతీయ దినపత్రిక సంపాదకుడు దామెర్ల సాయిబాబాకు దాసరి-వంశీ విశిష్ట పురస్కారం ప్రదానం

**హైదరాబాద్ (నాంపల్లి), మే 30, ప్రభాతవార్త :** ప్రతీరోజూ దీపం పెట్టుకోగానే కొంతమంది మహానుభావులను గుర్తుచేసుకోవాలని, అలాంటి మహానుభావుల్లో ఒకరైన ప్రాతఃస్మరణీయుడు, చిరస్మరణీయుడు దాసరి నారాయణరావు అని ప్రముఖ సినీనటుడు, నిర్మాత, మాజీ పార్లమెంటు సభ్యుడు ఎం. మురళీమోహన్ అన్నారు. ఆయనకు ఆరోగ్యం సరిగ్గా లేనప్పుడు కిమ్స్ ఆస్పత్రికి వెళ్లి మనసారా మాట్లాడుకోవడం జరిగిందని, ఆయన అనుమతి తీసుకొని పనిమీద అమెరికాకు వెళ్లిన నాలుగు రోజులకే దాసరి చనిపోయారు ఇకలేరన్న వార్త ఒక పిడుగులా వినిపించి నిశ్చేష్టుడనయ్యానని తీవ్ర ఆవేదన వెలిబుచ్చుతూ ఉద్వేగానికి లోనయ్యారు. ప్రముఖ సాంస్కృతి, సాహిత్య, సామాజిక సేవాసంస్థ వంశీ ఇంటర్నేషనల్ ఇండియా ఆధ్వర్యంలో ఫిలింనగర్ హైదరాబాద్‌లోని తెలుగు చలనచిత్ర నిర్మాతల మండలి వేదికలో మంగళ వారం సాయంత్రం దాసరి-వంశీ పురస్కారాల ప్రదానోత్సవం వైభవోపేతంగా నిర్వహించారు. వంశీ సంస్థల అధినేత కళాబ్రహ్మ, శిరోమణి డా. వంశీ రామ రాజు సభాధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ప్రముఖ సినీనటుడు, నిర్మాత, మాజీ పార్లమెంటు సభ్యుడు ఎం. మురళీమోహన్, విశిష్ట అతిథులు ప్రముఖ దర్శకుడు రేలంగి నరసింహారావు, సినీవిరాట్ తుమ్మలపల్లి రామసత్యనారాయణ, ప్రముఖ సినీనటుడు ఆర్.నారాయణ మూర్తి, సినీనిర్మాత సి.కళ్యాణ్, సినీగేయ రచయిత, జాతీయ కవి డా. సుద్దాల అశోక్‌తేజ, డా. వంశీ రామరాజు, సరస్వతీ ఉపాసకుడు దైవజ్ఞ శర్మ, చలనచిత్ర నిర్మాతల మండలి కార్యదర్శి టి.ప్రసన్నకుమార్ తదితరులతో కలిసి ప్రజాగాయకుడు గద్దర్‌ను దాసరి-వంశీ జీవితసాఫల్య పురస్కారం; వార్త జాతీయ దినపత్రిక సంపాదకుడు దామెర్ల సాయిబాబాకు దాసరి-వంశీ విశిష్ట పురస్కారం; ఆంధ్రపత్రిక మేనేజింగ్ ఎడిటర్ శర్మకు దాసరి-వంశీ విశిష్ట పురస్కారం; దాసరి-వంశీ ప్రతిభా పురస్కారాలను సుమన్, డా. లక్ష్మీప్రసాద్ కలపటపు, నంగునూరి చంద్రశేఖర్, నటుడు సంజీవి, దర్శకుడు ప్రభు, రచయిత వినాయకరావు, సంజయ్‌కిషోర్, పొత్తూరి రంగా రావు, ఎల్.వి.చెన్నారావు, విరాజ్‌వర్మ, సురేందర్ ప్రదానం చేశారు. ఈ సందర్భంగా మురళీమోహన్ మాట్లాడుతూ నీతి,నిజాయితీ ఉండాలని, తప్పుడు, చెడ్డ పనులు చేయకూడదని చెప్పేవారని, అది అక్షర సత్యమని దాసరి మహోన్నత వ్యక్తిత్వాన్ని కొనియాడారు. దాసరి పేరుమీద గద్దర్‌కు దాసరి-వంశీ జీవిత సాఫల్య పురస్కారం, దామెర్ల సాయిబాబాకు దాసరి- వంశీ విశిష్ట పురస్కారంతోపాటు ఇతర పురస్కార గ్రహీతల ఎంపిక చాలా సబబుగా ఉందని, పురస్కార గ్రహీతలకు అభినందనలు, శుభాకాంక్షలు తెలియజేసి, ఇంతటి అద్భుత కార్యక్రమాన్ని నిర్వహించిన వంశీరామరాజును మురళీమోహన్ అభినందించారు.వంశీ రామరాజు అధ్యక్షోపన్యాసంలో ఈ కార్యక్రమ, అవార్డుల నేపథ్యాన్ని, దాసరి నారాయణరావుతో తనకున్న అనుబంధాన్ని పంచుకొని, ప్రముఖ దర్శకుడు రేలంగి నరసింహారావు, సినీవిరాట్ తుమ్మలపల్లి రామ సత్యనారాయణ నేతృత్వంలోని కమిటీ దాసరి-వంశీ వివిధ పురస్కారాలకు అర్హులైన ప్రముఖులను ఎంపిక జేసినట్లు వివరించారు.

అనంతరం దాసరి-వంశీ విశిష్ట పురస్కార స్వీకర్త దామెర్ల సాయిబాబా తన స్పందనను తెలిపారు. తదుపరి విచ్చేసిన అతిథులు, దాసరి-వంశీ జీవిత సాఫల్య పురస్కార స్వీకర్త గద్దర్, ఇతర దాసరి పురస్కార సీకర్తలుప తమ స్పందన తెలిపారు. సభకుముందు నవసర గాయని, శృతిలయ ఆర్ట్స్ వ్యవస్థాపక కార్యదర్శి ఆయని, సుభాష్, రాజన్, ఎన్.శిరీష తదితర వర్ధమాన గాయకులచే ఆణిముత్యాల్లాంటి చలనచిత్ర గీతాల సినీసంగీత విభావరి ఆహుతులకు వీనులవిందు చేసింది.



వంశీ ఇంటర్నేషనల్ ఇండియా మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో అవార్డులు అందుకున్న గద్దర్, వార్త ఎడిటర్ దామెర్ల సాయిబాబా తదితరులు. చిత్రంలో మురళీమోహన్, వంశీరామరాజు, సుద్దాల అశోక్‌తేజ ప్రభృతులు

# మన మహిళలు, వారి సంఘాలు దేశానికే ఆదర్శం

## సిఎం కెసిఆర్ హయాంలోనే మహిళా సంఘాలు బలోపేతం

## వివిధ కేటగిరీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన మహిళలకు అవార్డులు అందించిన మంత్రి ఎర్రబెల్లి



**హైదరాబాద్, మే 30, ప్రభాతవార్త:** మన డ్వాక్రా మహిళలు, మహిళా సంఘాలు దేశానికికే ఆదర్శం. వాళ్లు చేస్తున్న పొదుపు, రుణ విలువలు కూడా దేశ సగటున కన్నా ఎక్కువ అని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. మన రాష్ట్రంలోనూ ఇంతగా పనిచేస్తున్న మహిళా సంఘాలు లేవు, మహిళలు ఆర్థికంగా ఎదగాలన్నదే ప్రభుత్వ లక్ష్యం అన్నారు. సిఎం కెసిఆర్ హయాంలోనే మహిళా సంఘాలు బలోపేతం అవుతున్నాయన్నారు. నగరంలో నిర్వహించిన కార్యక్రమంలో 2023-24 సంవత్సరానికి సెర్ప్-పేదరిక నిర్మూలన సంస్థ, బ్యాంకు లింకేజీ లక్ష్య రూ.15,037.40కోట్లుగా నిర్ణయించారు.ఈ బ్యాంకు లింకేజీ వార్షిక ప్రణాళికను మంత్రి ఎర్రబెల్లి ఆవిష్కరించారు. అదేవిధంగా గత యేడాది బ్యాంకు రుణాలతో చిన్న పరిశ్రమలు నెలకొల్పిన మహిలల విజయగాథల పుస్తకాన్ని ఆవిష్కరించారు. వివిధ కేటగిరిలలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన మహిళలకు, అధికారులకు అవార్డులను అందించారు.

ఈ సందర్భంగా మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు మాట్లాడుతూ మహిళలు చిన్న తరహా నుంచి పెద్ద పారిశ్రామిక వేత్తలుగా ఎదగాలన్నారు. మహిళలకు వారి అవసరాలకు తగినన్ని నిధులను బ్యాంకులు రుణాలుగా ఇవ్వాలన్నారు. వీలైనంత వరకు మహిళలకు ఇచ్చే రుణాల నిబంధనలను సడలించలన్నారు. వడ్డీ రేట్లు అన్ని బ్యాంకుల్లో ఒకే విధంగా ఉండేలా చూడండి అన్నారు. సాధ్యమైనంత వరకు సర్వీసు చార్జీలు లేకుండా చూడాలని బ్యాంకర్లకు సూచించారు. దేశంలో అత్యధికంగా మహిళల ద్వారానే 98 శాతం రికవరీ ఉంది. దేశంలో 57శాతం మహిళలు రుణాలు అందుతంటు దేశంలో 76 శాతం రుణాలు అందిస్తున్నామని, సగటున రూ.5,56,556 రుణాలు అందించామన్నారు. రాష్ట్రంలో 32 జిల్లాల్లో 98 శాతం మహిళలు భాగస్వాములుగా డ్వాక్రా సంఘాలు పనిచేస్తున్నాయి. 553 మండల సమాఖ్యలు 4,30,358 స్వయం సహాయక సంఘాలతో 46,46,120 మంది మహిళలు సభ్యులుగా ఉన్నారు. స్వయం సహాయక సంఘాల రుణ విలువ ఈ యేడాది 2023 మార్చి 31 నాటికి రూ.3,924.50 కోట్లుగా ఉందన్నారు. గ్రామీణ పేద మహిళలను స్వయం సంఘాలలో సభ్యులుగా చేర్చడంలో మన రాష్ట్రంలో దేశంలోనే ప్రథమ స్థానంలో నిలిచిందన్నారు. అదేవిధంగా ఒక స్వయం సహాయక సంఘానికి సగటున రూ.10లక్షలు అంతకన్నా ఎక్కువ బ్యాంకురుణం అందించడంలో దేశంలో ప్రథమ స్థానంలో ఉన్నామన్నారు.

**మహిళల ఆలోచనలకు అనుగుణంగా బ్యాంకర్లు ఆలోచించాలి: సందీప్‌కుమార్ సుల్తానియా**

మహిళల ఆలోచనలకు అనుగుణంగా బ్యాంకర్లు ఆలోచించాలని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ ముఖ్యకార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తానియా అన్నారు. 25 సంవత్సరాలలోపు పోలిస్తే, ఇప్పుడు మహిళలు బాగా అభివృద్ధి చెందారు. వారి ఆలోచించాల్సి అవసరం లేదన్నారు.

# తెలంగాణ దశాబ్ది ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలి

- మిషన్ భగీరథ కార్యదర్శి స్మితా సభర్వాల్

**హైదరాబాద్, మే 30, ప్రభాతవార్త:** తెలంగాణ దశాబ్ది ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలని మిషన్ భగీరథ ఇంజనీర్లు, అధికారులను ముఖ్యమంత్రి కార్యదర్శి, మిషన్ భగీరథ కార్యదర్శి స్మితాసభర్వాల్ ఆదేశించారు. జూన్ 18న నిర్వహించే మంచినీళ్ల పండగ కోసం ఏర్పాటు ఘనంగా చేయాలన్నారు. హైదరాబాద్ ఎర్రమంజిల్‌లోని మిషన్ భగీరథ కార్యాలయంలోన చీఫ్ ఇంజనీర్లు, అన్ని జిల్లాల ఎస్ఈలతో దశాబ్ది ఉత్సవాలపై స్మితా సభర్వాల్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ వేడుకల కోసం హైదరాబాద్ మినహా మిగిలిన 32 జిల్లాలకు ఇంచార్జ్‌లను స్మితా సభర్వాల్ నియమించారు. జూన్ 18న మిషన్ నీటి శుద్ధి కేంద్రాలు, గ్రామాల్లో వేడుకలు నిర్వహించాలన్నారు. నాడు మంచినీళ్ల కోసం పడ్డ కష్టాలను, నేడు మిషన్ భగీరథతో అవుతున్న తాగునీటి సరఫరాను గ్రామస్థులకు వివరించాలన్నారు. గ్రామస్థులు, ప్రజాప్రతినిధులు, విద్యార్థులు, మీడియా ప్రతినిధులను వాటర్ ట్రీట్‌మెంట్‌కు తీసుకుపోయి నీటి శుద్ధి ప్రక్రియను చూపించాలన్నారు. నీళ్లు ఎక్కడి నుంచి వస్తున్నాయి? ఎన్నిక గ్రామాలకు సరఫరా అవుతున్నాయన్నా అంశాలకు వారికి వివరించాలన్నారు. ఈ సంబురాల్లో గ్రామస్థులందరూ పాల్గొనేలా చూడాలన్నారు. ఇక జూన్ 13వ తేదిన నిర్వహించే మహిళా సంక్షేమ దినోత్సవం సంబురాల్లో మిషన్ భగీరథ మహిళా ఇంజనీర్లు, ఉద్యోగులు పెద్ద ఎత్తున పాల్గొనాలన్నారు. భగీరథ ప్రధాన కార్యాలయంతో పాటు ఎస్ఈ ఆఫీసుల్లో మహిళా ఉద్యోగుల కోసం ప్రత్యేకంగా సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించాలన్నారు. అత్యుత్తమ పనితీరు కనబరుస్తున్న మహిళా ఉద్యోగులను ఘనంగా సన్మానించారు. ఈ సమావేశంలోన ఈఎన్‌సి కృపాకర్‌రెడ్డి, ప్రభుత్వం సలహాదారులు జ్ఞానేశ్వర్‌పాటు అధికారులు పాల్గొన్నారు.

# అంతర్జాతీయ గేమ్స్‌లో ఇద్దరు ఆర్టీసి ఉద్యోగులకు పతకాలు

**హైదరాబాద్, మే 30, ప్రభాతవార్త:** అంతర్జాతీయ పోటీల్లో ఇరువురు టిఎస్ ఆర్టీసీ ఉద్యోగులకు పతకాలు లభించాయి. సౌత్ కొరియాలో ఇటీవల జరిగిన ఇంటర్నేషనల్ ఆసియా పసిఫిక్ మాస్టర్స్ గేమ్స్‌లో టిఎస్ ఆర్టీసీకి చెందిన ఇద్దరు ఉద్యోగులు సత్తా చాటి గోల్డ్, సిల్వర్ పతకాలను సాధించారు. జీడిమెట్ల డిపోకు చెందిన కండక్టర్ ఎం అంజలి అర్చరీ 18 మీటర్ల విభాగంలో గోల్డ్ మెడల్, కరీంనగర్ జోనల్ వర్క్ షాప్ మెకానిక్ కె కిషన్ 30 మీటర్ల విభాగంలో సిల్వర్ మెడల్ సంపాదించారు. హైదరాబాద్‌లో ఫిబ్రవరిలో జరిగిన ఆల్ ఇండియా మాస్టర్స్ గేమ్స్‌లో మంచి ప్రతిభ కనపరచడంతో ఇంటర్నేషనల్ ఆసియా పసిఫిక్ మాస్టర్స్ గేమ్స్‌కు ఎంపికయ్యారు. సౌత్ కొరియాలోని జియోన్‌బుక్‌లో ఈ నెల 12 నుండి 20వ తేదీ వరకూ ఈ పోటీలు జరిగాయి. కాగా పతకాలు సాధించడంపై సంస్థ ఎండ సజ్జనర్ హర్షం వ్యక్తం చేశారు. బస్ భవన్‌లో మంగళవారం అంజలి, కిషన్‌లను అభినందించారు. అంతర్జాతీయ క్రీడల్లో రెండు పతకాలు సాధిం చడం ఆర్టీసీకి గర్వకారణమన్నారు. జాతీయ, అంత ర్జాతీయ క్రీడల్లో పాల్గొనే సంస్థ ఉద్యోగులకు అన్ని విధాలుగాను సహకారం అంది స్తామని హామీ ఇచ్చారు.



# జూబ్లీహిల్స్ దోపిడీపై వీడిన మిస్టరీ

## నిందితుడి అరెస్టు.. రూ.9.50 లక్షల నగదు జప్తు

**హైదరాబాద్, మే 30, ప్రభాతవార్త:** నగరంలోని జూబ్లీహిల్స్‌లో ఈ నెల 12వ తేదీన ఉదయం జరిగిన భారీ దోపిడి కేసులో మిస్టరీ వీడింది. ఈ కేసులో నిందితుడుగా ఓ సాఫ్ట్‌వేర్ కంపెనీ ఉద్యోగి వుండడం సంచనం రేపింది. ఈ కేసులో పది లక్షల రూపాయ ల నగదు దోపిడికి గురికాగా నిందితుడిని అరెస్టు చేసి అతని వద్ద నుంచి తొమ్మిది లక్షల 50 వేల రూపాయల నగదును జప్తు చేశారు. దీనికి సంబంధించిన వివరాలను సిటీ కొత్వాల్ ఆనంద్ మంగళవారం మీడియాకు వెల్లడించారు. జూబ్లీహి ల్స్‌లోని రోడ్ నంబర్ 52లో వుంటన్న ఓ ఇంట్లో ఈ నెల 12వ తేదీన భారీ దోపిడి జరగడం తెలిసిందే.

గుర్తు తెలియని దుండగుడు ముఖానికి ముసుగు ధరించి, ని చ్చెన ద్వారా ఇంట్లోకి ప్రవేశించి, మొదటి అంతస్తులో వున్న గర్భిణి స్త్రీని బెదిరించి, ఆ తరువాత ఇంట్లోని అందరిని హడలెత్తించి, వారి సెల్‌పోన్లను లాక్కుని ఫ్లైట్ మోడ్‌లో వుంచి ఆరు గంటలకు పైగా ఇం ట్లోనే వుండడం విదితమే. తనకు అత్యవసరంగా 20 లక్షల రూపాయలు కావాలని, లేకుంటే గర్భిణీ స్త్రీని చంపుతానని కత్తి తో బెదిరించాడు. దీంతో కుటుంబ సభ్యులు తమకు తెలిసిన వారి నుంచి ఎనిమిది లక్షల రూపాయలు తెప్పించి, తమ వద్ద వున్న రెండు లక్షల రూపాయల నగదును కూడా కలిపి సదరు నిందితుడికి పది లక్షల రూపాయలు ఇచ్చుకున్నారు. దీని తరువాత అతను పోలీసులకు ఎలాంటి ఆధారాలు లభించకుండా జాగ్రత్త పడ్డాడు. ఆఖరు కు తాను పారిపోయేందుకు ఓలా కారును దోపిడికి పాల్పడ్డ ఇంట్లోని వారిచేతే బుక్ చేయించు కున్నాడు.

ఈ ఘటనపై మొదట షాక్‌కు గురైన ఇంట్లోని వారు గంటన్నర తరువాత తేరుకుని పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై కేసు నమోదు చేసిన జూబ్లీహిల్స్ పోలీసు లు భిన్న కోణాల్లో విచారించారు. మొదట సిసి కెమెరాలను, ఆ తరు వాత సమీపంలోని అన్ని టవర్లలోని సెల్‌ఫోన్ సిగ్నళ్లను పరిశీలించారు. దీంతో పాటు సాంకేతికత ఆధారంగా మరికొంత సమాచారం సేకరించారు.

వీటి ఆధారంగా ఈ దోపిడికి పాల్పడింది సికింద్రాబాద్‌లోని రెజిమెంటల్ బజార్‌కు చెందిన పటేల్ మోతీరాం రాజేష్ యాదవ్ (26)గా గుర్తించారు. మాదాపూర్‌లోని డెల్ కంపెనీలో ఇత ను కస్టమర్ సర్వీస్ విభాగంలో స్పెషలిస్ట్‌గా పనిచేస్తున్నట్లు తేలింది. అడ్డగోలు వ్యసనాలకు లోనవడంతో పాటు బెట్టింగ్‌లకు అలవాటై భారీగా అప్పుల్లో మునగడంతో వా టి నుంచి బయట పడేందుకు యూ ట్యూబ్‌లు గమనించి దోపిడి పథకానికి శ్రీకారం చుట్టాడు. ఇందుకోసం ప్రముఖులు వుండే జూబ్లీహిల్స్‌ను ఎంచుకున్నాడు. అనుకున్నదే తడవుగా ఈ నెల 12వ తేదీన పక్కాగా వ్యవహరించి దోపిడికి పాల్పడి ఉడాయించాడు. అయితే పోలీసులు సాంకేతికంగా ముందంజవేసి ఇతగాడి ఆటకట్టించారు. ఇతన్ని మంగళవారం నాడు అరెస్టు చేశారు. ఈ సందర్భంగా నిందితుడు తన నేరాన్ని అంగీకరించాడు. ఇతని వద్ద నుంచి దోపిడికి గురైన పది లక్షల రూపాయల్లో తొమ్మిది లక్షల 50 వేల రూపాయలను జప్తు చేశారు. ఈ కేసులో నిందితుడిని అరెస్టు చేసిన పోలీసులను కొత్వాల్ అభినందించారు. ఈ సమావేశంలో పశ్చిమ మండల డిసిపి జోయల్ డేవిస్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌బిఐలో వారం రోజుల వ్యవధిలో..

# రూ.17 వేలకోట్ల విలువైన రూ.2 వేల నోట్ల మార్పిడి

**హైదరాబాద్, మే 30, ప్రభాతవార్త:** దేశీయ అతి పెద్ద బ్యాంక్ స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా కీలక ప్రకటన చేసింది. 2 వేల నోట్ల రూపాయల మారకం విషంలో ముఖ్యమైన విషయాన్ని వెల్లడించింది. కేవలం వారం రోజుల వ్యవధిలో దాదాపు 17 వేల కోట్ల రూపాయల విలువైన 2 వేల రూపాయల నోట్లను డిపాజిట్ చేశారని వెల్లడించింది. బ్యాంకులు ఈ నెల 23వ తేదీ నుండి 2 వేల రూపాయల నోట్లను మార్చుకునేందుకు అవకాశం కల్పిస్తున్నాయి. సెప్టెంబరు 30వ తేదీ వరకూ ఈ ప్రక్రియ కొనసాగుతుంది. ఈ నేపథ్యంలో స్టేట్ బ్యాంక్ ఫారిన్ కరెన్సీ బాండ్ల లిస్టింగ్ కార్యక్రమంలో ఎస్‌బిఐ ఛైర్మన్ దినేశ్ కుమార్ ఖారా మాట్లాడుతూ దాదాపు 14 వేల కోట్ల రూపాయల విలువైన 2 వేల రూపాయల నోట్లను ప్రజలు వారి బ్యాంక్ అకౌంట్లలో డిపాజిట్ చేసుకున్నారని తెలిపారు. అలాగే 3 వేల కోట్ల రూపాయల విలువైన 2 వేల రూపాయల నోట్లను మార్చుకున్నారని వెల్లడించారు. మార్కెట్‌లో దాదాపు 20 శాతం వాటాను కలిగి ఉన్నామని చెప్పారు.

# బిఆర్ఎస్‌లో చేరిన మధ్యప్రదేశ్ నేతలు

## బుద్ధసేన్ పటేల్‌ను కోఆర్డినేటర్‌గా నియమించిన సిఎం కెసిఆర్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, మే 30:** భారత రాష్ట్ర సమితి(బిఆర్ఎస్) పట్ల ఆదరణ, బిఆర్ఎస్ అధినేత, ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖరరావు పట్ల విశ్వాసం,దిన దిన ప్రవర్ధమానవుతూ దేశ వ్యాప్తంగా విస్తరిస్తోందని ఆ పార్టీ వర్గాలు పేర్కొన్నాయి. మహారాష్ట్రకు చెందిన అన్ని వర్గాల ప్రజలు,మేధావులు,పలు పార్టీలకు చెందిన రాజకీయ నాయకులు బిఆర్ఎస్ పార్టీ పట్ల ఆ పార్టీ ప్రభుత్వం తెలంగాణలో అమలు చేస్తున్న అభివృద్ధి సంక్షేమం పట్ల ఆకర్షితులౌతున్నారు. తెలంగాణ మోడల్ పాలన మాకూ కావాలనే బలమైన ఆకాంక్షతో పార్టీలో నిర్విరామంగా చేరికల పరంపర కొనసాగుతున్నది. మంగళవారం నాడు మరో ముఖ్యఘట్టం చోటు చేసుకుంది. ఇప్పటికే పలు రాష్ట్రాల నుంచి చేరికలు జరుగుతున్న నేపథ్యంలో మధ్యప్రదేశ్ నుంచి బిఆర్ఎస్‌లోకి చేరికలు ప్రారంభమయ్యాయి. మధ్యప్రదేశ్‌కు చెందిన మాజీ ఎంపీ సహా మాజీ ఎమ్మెల్యేలు పలువురు ప్రజాప్రతినిధులు ప్రజల్లో పట్టువున్న ముఖ్యనేతలు మంగళవారంనాడు బిఆర్ఎస్‌లో చేరడం ప్రాధాన్యత సంతరించుకుంది. మధ్యప్రదేశ్ రాష్ట్రం రేవా పార్లమెంటరీ నియోజకవర్గం బిజెపి పార్టీకి చెందిన మాజీ ఎంపీ బుద్దసేన్ పటేల్ బిఆర్ఎస్ అధినేత సిఎం కెసిఆర్ సమక్షంలో చేరారు. వారికి అధినేత గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. వీరితో పాటు బిఎస్పీ పార్టీ నుంచి మాజీ ఎమ్మెల్యే డాక్టర్ నరేశ్ సింగ్ గుర్జార్, ఎస్పీ పార్టీకి చెందిన సాత్నా మాజీ ఎమ్మెల్యే ధీరేంద్ర సింగ్, సాత్నా మాజీ జిల్లా పంచాయతీ సభ్యులు విమల బాగ్రి, సర్వజన్ కళ్యాణ్ పార్టీ జాతీయ అధ్యక్షుడు సంజయ్ యాదవ్,భోపాల్‌కు చెందిన రాకేశ్ మాల్వీయ, సత్యేంద్ర సింగ్ తదితరులు బిఆర్ఎస్ పార్టీలో చేరారు. కాగా, పార్టీలో చేరిన మాజీ ఎంపీ బుద్దసేన్ పటేల్‌ను మధ్యప్రదేశ్ రాష్ట్ర బిఆర్ఎస్ పార్టీ కోఆర్డినేటర్‌గా జాతీయ అధ్యక్షులు సిఎం కెసిఆర్ నియమించారు. కాగా, తాము మధ్యప్రదేశ్‌కు తిరిగి వెళ్లిన తర్వాత ఇప్పటికే ఆసక్తితో ఎదురుచూస్తున్న అక్కడి ప్రజలు నేతలతో సమావేశమై విస్తృతంగా చర్చించనున్నట్లు పార్టీలో చేరిన నేతలు తెలిపారు. త్వరలో తిరిగి హైదరాబాద్‌కు వచ్చి భారీ సంఖ్యలో బిఆర్ఎస్‌లో చేరుతామని తెలిపారు. అనంతరం భోపాల్ బహిరంగ సభ ఏర్పాటు చేస్తామని, ఈ సభకు అధినేత కెసిఆర్‌ను రావాల్సిందిగా వారు ఆహ్వానించారు. ఈ సందర్భంగా చెన్నూర్ ఎమ్మెల్యే బాల్కసుమన్ తదితరులు పాల్గొన్నారు.

# కుల వృత్తిదార్లకు రూ.లక్ష ఆర్థిక సాయం

## ఒక్కో నియోజకవర్గంలో 1,500 మందికి ఛాన్స్

## విధివిధానాలపై అధికారుల కసరత్తు

**హైదరాబాద్, మే 30, ప్రభాతవార్త :** కులవృత్తితో జీవనోపాధి పొందుతున్న ఎంబీసీ, బీసీలకు లక్ష రూపాయల మేర ఆర్థిక సహాయం చేయాలని తెలంగాణ సర్కార్ నిర్ణయించింది. రాష్ట్ర వ్యాప్తంగా దాదాపు లక్షన్నర మందికి ఆర్థిక సహాయం అందచేయనుంది. ఒక్కో నియోజకవర్గంలో 1,200 నుండి 1,500 మంది వరకూ లబ్ధిదారులకు ఆర్థిక సహాయం అందించనుంది. దీనికి సంబంధించి వెనుకబడిన తరగతుల శాఖ అధికారులు విధివిధానాలపై కసరత్తు చేస్తున్నారు. ఈ కసరత్తు పూర్తిన తదుపరి వీటికి సంబంధించి దరఖాస్తుల స్వీకరణ, లబ్ధిదారుల ఎంపిక, ఆర్థిక సహాయం తదితర విధివిధానాలను మంత్రివర్గ ఉప సంఘం ఖరారు చేయనుంది. ఎలాంటి హామీ, పూచీకత్తు లేకుండా పూర్తి సబ్సిడీతో లక్ష రూపాయల చొప్పున ఆర్థిక సాయం అందించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి.

